సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
దండుమల్కాపురం సమీపంలో హైవేపై సోమవారం ఆర్టీసీ బస్సు ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. - 8లో



70వ వసంతంలోకి..
రెండు తెలుగు రాష్ట్రాలకు వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు 70వ వసంతంలోకి అడుగు పెడుతోంది. - 8లో



అభివృద్ధిపై చర్చకు సిద్ధం
పదేళ్ల పాలనలో ఆలేరులో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

శివకేశవులకు సంప్రదాయ పూజలు



శివాలయంలో స్పటిక లింగానికి హారతినిస్తున్న ప్రధాన పూజారి

యాదగిరిగుట్ట: శివకేశవులకు నిలయమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు విశేషంగా నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగించారు. ఆలయంలో వైభవంగా నిత్యకల్యాణ వేడుక, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు వంటి పూజలను ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు.

ప్రథమ భూదాతకు ఘన నివాళి



వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి: ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి 37వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో వినోబాభావే సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మోటె రజిత రాజు, సేవా సమితి ఉపాధ్యక్షుడు కొయ్యడ నర్సింహ, ప్రధాన కార్యదర్శి వేశాల మురళి, భారత భాస్కర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేకే మాటల గారడీ



మాట్లాడుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల గారడీ చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మునుగోడు నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత బస్సు హామీని అమలు చేసి మిగతా హామీలన్నీ అమలు చేసినట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు.. 66మోసాలతో ఏడాది పాలన ముగించారని విమర్శించారు. హామీలు అమలు చేసే వరకు వెంటాడుతామన్నారు. సమావేశంలో పార్టీ నల్లగొండ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి కట్టా సుధాకర్‌రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, దూడల భిక్షం, జక్కలి రాజు, రాసాల జనార్దన్‌రెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఆలె చిరంజీవి, బత్తుల జంగయ్య, కె.అశోక్, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్ పాల్గొన్నారు.

● సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా చౌటుప్పల్ పట్టణంలో సోమవారం ఆమె ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణపై 11న బహిరంగ విచారణ

భువనగిరి టౌన్: ఎస్సీ వర్గీకరణపై బహిరంగ విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ ఈనెల 11న నల్లగొండకు వస్తున్నారని కలెక్టర్ హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించే బహిరంగ విచారణలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విచారణకు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు.

యాసంగి సాగుకు రెడీ

ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ
- 3.19 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా
- ఎరువులు, విత్తనాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- సాగు పనుల్లో నిమగ్నమైన రైతాంగం



ఆత్మకూర్ (ఎం) మండలం లింగరాజుపల్లిలో వరినాట్లు వేస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) పొలం దున్నుతున్న రైతు)

సాక్షి, యాదాద్రి: యాసంగి సాగుకు వ్యవసాయ శాఖ యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 3,19,320 ఎకరాల్లో రైతులు అన్నిరకాల పంటల సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో అధికంగా వరి.. ఆ తర్వాత మెట్టపంటలు సాగు అయ్యే అవకాశం ఉండడంతో ఇందుకు అనుగుణంగా యంత్రాంగం విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తోంది. అవసరమైన ఎరువులు, విత్తనాల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో రైతాంగం కూడా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొన్నిచోట్ల వరినార్లు పోసుకుంటుండగా మరికొన్ని చోట్లలో వరినాట్లు పెడుతున్నారు.

మెండుగా మూసీ, గోదావరి జలాలు

ఈ యాసంగి సీజన్‌కు జిల్లాలో సాగునీటి వసతి పెరుగుతోంది. గతంలో మాదిరిగానే మూసీ ఆయకట్టులో కాలువల ద్వారా జలాలు అందుబాటులోకి వచ్చాయి. పూర్తిగా భూగర్భజలాలపై ఆధారపడ్డ ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని రైతులకు అక్కడక్కడా గోదావరి జలాలు అందుతున్నాయి. మూసీ ఆయకట్టుతోపాటు, నాన్‌మూసీ ఏరియాలోని చెరువులు, కుంటలను కొండపోచమ్మ, బస్వాపూర్, తపాసుపల్లి రిజర్వాయర్‌ల ద్వారా గోదావరి జలాలతో నింపుతున్నారు. దీంతో బోర్లు, బావుల్లో భూగర్భజలాలు పెరుగుతున్నాయి. చెరువులు అలుగులుపోస్తూ అడుగంటిన బోర్లు సైతం నిండుగా పోస్తున్నాయి. దీంతో రైతులు వరిసాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

2.98 లక్షల ఎకరాల్లో వరిసాగు అంచనా

ఈ యాసంగిలో 2.98 లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా. అయితే 2023 యాసంగి సీజన్‌లో 2,93,292 ఎకరాల్లో వరిసాగు జరిగింది. అయితే ఈ సారి ఆరుతడి పంటలు, నూనెగింజల పంటలు, ఇతర పంటలు అన్ని కలిపి సుమారు 3.19 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని లెక్కించారు. అయితే గత యాసంగితో పోలిస్తే ఈసారి సుమారు 4,708 వేల ఎకరాల్లో వరిసాగు ఎక్కువగా జరగవచ్చని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లోనే సన్నరకం వడ్లు పండించడానికి రైతులు ఆసక్తి చూపారు. ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినా ఈ సారి రైతులు దొడ్డురకం వడ్ల సాగుకే మొగ్గు చూపిస్తున్నట్టు తెలుస్తోంది.

విత్తనాలు, ఎరువులు సిద్ధంగా..

రైతులు యాసంగి పంటల సాగుకు అధికారులు విత్తనాలు, ఎరువుల అంచనాలు సిద్ధం చేశారు. యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ ఎరువులు 57,816 మెట్రిక్ టన్నులు, అలాగే 74,500 మెట్రిక్ టన్నుల విత్తనాలు సిద్ధం చేశారు. ఇందుకోసం కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు డీలర్లు, పీఏసీఎస్‌ల ద్వారా విక్రయించడానికి ఏర్పాట్లు చేశారు. దీంట్లో భాగంగా ఇప్పటికే యంత్రాంగం సమావేశాలు ఏర్పాటుచేసి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

వరినాట్ల కోసం పొలం సిద్ధం



భీమలింగం కాలువ ద్వారా మూసీనీరు సమృద్ధిగా వస్తుంది. నాకున్న తొమ్మిది ఎకరాల్లో వరిసాగు చేస్తున్నా. ఎకరాకు రూ.40 వేల ఖర్చు వస్తుంది. నాటు పెట్టడానికి పొలం సిద్ధం చేస్తున్నా. ప్రభుత్వం రైతు భరోసా ఇస్తే బాటుంటుంది.

– ఎర్ర కృష్ణారెడ్డి, లింగరాజుపల్లి, ఆత్మకూర్ (ఎం) మండలం

యాసంగి సాగు అంచనా..

పంటలు	ఎకరాలు
వరి	2,98,000
తృణధాన్యాలు	65
పప్పు దినుసులు	50
నూనెగింజలు	55
ఇతర పంటలు	21,150
మొత్తం	3,19,320

అవసరమైన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో..)

యూరియా	25,282
డీఏపీ	10,419
ఎంఓపీ	4,167
కాంప్లెక్స్	16,670
ఎస్ఎస్‌పీ	1,278

అవసరమైన విత్తనాలు

పంట	క్వింటాళ్లు
వరి	74,500
మిల్లెట్స్	5.20
పల్సెస్	02
నూనెగింజలు	28

రూ. 1,203 కోట్లతో తుంగతుర్తి అభివృద్ధి

అన్ని వర్గాలకు అందుబాటులోకి ప్రజా ప్రభుత్వం

- నిత్యం నేను ప్రజల మధ్యనే ఉంటున్నా
- వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా
- గతంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కుంటుపడింది
- బిక్కేరు నుంచి దోసెడు ఇసుక కూడా పోనీయడం లేదు
- అస్తవ్యస్తంగా ఉన్న నియోజకవర్గాన్ని గాడిన పెడుతున్న

'సాక్షి' ఇంటర్వ్యూలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'పదేళ్ల కాలంలో తుంగతుర్తి నియోజకవర్గంలో ఇక్కడి పుల్ల అక్కడ వేయలే. ఒక్క కొత్త రోడ్డు లేదు. కొత్త బిల్డింగ్ కట్టలేదు. కొత్త కాలువలు తవ్వలేదు. చెక్‌డ్యామ్‌లను ప్రారంభించి కమీషన్లు తీసుకొని మధ్యలోనే వదిలేశారు. అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయింది. నేనొచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి రూ. 1,203 కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తున్నా..' అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గంలో గత పరిస్థితులు, తాము తీసుకొచ్చిన మార్పులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

బీఆర్ఎస్ పాలనలో భూ దందా, ఇసుక మాఫియా

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నియోజకవర్గం అస్తవ్యస్తంగా మారింది. అంతటా భూదందా, ఇసుక మాఫియానే. అభివృద్ధిని పట్టించుకోలేదు. దీంతో నియోజకవర్గం పదేళ్లు వెనక్కిపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎంతో మార్పు తెచ్చాం. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ.. వారి సమస్యలు పరిష్కరిస్తున్నా. అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నా.

నా దగ్గర అంతా సమానమే

నియోజకవర్గ చరిత్రను ప్రజలు తిరగరాశారు. కనీవిని ఎరుగని మెజార్టీ ఇచ్చారు. దాన్ని కాపాడుకుంటా. అభివృద్ధి మాత్రమే కాదు ప్రతి ఒక్క కార్యకర్త నా పక్కనే కూర్చుని చెప్పేంత స్వేచ్ఛను ఇస్తున్నా. గతంలో ఉన్న నాయకునికి ఎదురుగా వెళ్లే పరిస్థితి లేదు. నేనలా కాదు., అందరు నా పక్కనే కూర్చొని సమస్యలు చెప్పేలా చేశా. నేను ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నా. జాజిరెడ్డి గూడెంలో ఎస్సీల భూములన్నీ డ్రెయినేజీ వల్ల మునిగిపోతుంటే దానిని బాగు చేయించా. తద్వారా 30 ఎకరాల్లో వారు ఇప్పుడు వ్యవసాయం చేసుకుంటున్నారు. గతంలో బిక్కేరులో ఇసుక లారీలు తాండవం ఆడుతుండేవి. హామీ మేరకు బిక్కేరు నుంచి దోసెడు ఇసుక కూడా పోనీయడం లేదు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తీసుకొచ్చా

రూ. 300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తీసుకొచ్చా. రూ. 10 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులతో అభివృద్ధిపనులు చేపట్టా. కంచనపల్లి వద్ద కేజీబీవీకి ప్రహరీని రూ.77 లక్షలతో చేపట్టా. ఒక్కొక్కటి రూ. 32 లక్షలతో 9 గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేయించా. తుంగతుర్తికి ఐటీఐ మంజూరు చేయించా. తిరుమలగిరి మున్సిపాలిటీకి రూ. 15 కోట్లు, జూనియర్ కాలేజీని, మోత్కూరుకు కాలేజీ హాస్టల్‌ను మంజూరు చేయించా. మోత్కూరులో 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించా. తుంగతుర్తిలో 100 పడకల ఆసుపత్రిని బాగు చేయించేందుకు చర్యలు చేపడతా.

సాగునీటిపై ప్రత్యేక దృష్టి

బునాదిగాని కాలువ కోసం రూ. 267 కోట్లు మంజూరు చేయించా. టెండర్ పూర్తయింది. శాలిగౌరారంలో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆసిఫ్‌నహర్ కాలువ భూసేకరణకు పరిహారం ఇప్పించా. కాలువలను బాగు చేయించి 10 చెరువులు నింపించా. రైతులకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. నియోజకవర్గ యువత కోసం అడ్డగూడూరు మండలలో 180 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇండస్ట్రియల్‌పార్కు పెట్టించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాను. మోత్కూరులో డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు చేపడతాను.

అత్యధికంగా రోడ్లు, బ్రిడ్జీలు

నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి రూ. 32 లక్షల చొప్పున కేటాయించి 9 మండలాల్లో అభివృద్ధి పనులను చేయిస్తున్నా. మండల కేంద్రాల నుంచి గ్రామాలకు లింకు రోడ్లు అభివృద్ధి చేస్తున్నా. వారు వదిలేసిన చెక్ డ్యాంలను పూర్తి చేశా. బిక్కేరుపై మోత్కూరు – గుండాల బ్రిడ్జి కొత్తది నిర్మిస్తా. ధర్మారం నుంచి వర్ధమానుకోట మధ్యలో బ్రిడ్జి వేస్తా. నూతనకల్, గుండ్లసింగారం దగ్గర కూలిపోయిన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టా. రూ. 32 కోట్లతో తిమ్మాపురం, కోమటిపల్లి, కొమ్మాల, కోడూరు, తుంగతుర్తి నుంచి సంగెం ఎల్కపల్లి, చిల్పకుంట్ల, నూతన్‌కల్ వరకు 22 కిలోమీటర్ల డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేశా. తుంగతుర్తి నుంచి రావులపల్లి క్రాస్ రోడ్డు వరకు రూ. 16 కోట్లతో డబుల్‌రోడ్డు చేయించా. శాలిగౌరారం నుంచి రామగిరి వరకు రూ. 3.5 కోట్లతో రోడ్డు వేయించా. వల్లాల నుంచి జోలవారిగూడేనికి రోడ్డు మంజూరు చేయించా. గురజాల నుంచి చౌళ్లరామారం వరకు రూ. 25 కోట్లలో డబుల్‌రోడ్డు చేయించేందుకు చర్యలు చేపట్టా. మొత్తంగా నియోజకవర్గానికి రూ. 1203 కోట్ల పనులు తీసుకువచ్చా.

అర్జీలు వేగంగా పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

భువనగిరి టౌన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. సోమవారం భువనగిరి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 34 అర్జీలను స్వీకరించి మాట్లాడారు. అర్జీలు పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం

ప్రజావాణిలో డీఎస్ఓకు వచ్చిన వినతి పత్రం స్వీకరించిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి మైక్‌లో రెండు సార్లు పిలిచిన సదరు అధికారి రాకపోవడంతో ఆ శాఖకు సంబంధించి మరో అధికారి వచ్చి తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రజావాణికి జిల్లా అధికారులు ఎదుకురావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరైన సీనియర్, జూనియర్ అధికారులపై మండిపడ్డారు. జిల్లా వ్యవసాయ అధికారి సైతం ప్రజావాణికి రాకపోవడంతో ఆ శాఖకు వచ్చిన వినతి పత్రం అదనపు కలెక్టర్ వద్దే ఉంచుకున్నారు. జిల్లా అధికారులు ప్రజావాణికి రాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.10 కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయం!

- విజిలెన్స్ అధికారుల తనిఖీలో వెలుగులోకి..
- పోచంపల్లి మండలం ముక్తాపూర్‌లో ఘటన
- రైస్‌మిల్లు సీజ్.. యజమానిపై కేసు నమోదు



రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు



మిల్లులో పాడైపోయి ఉన్న ధాన్యం

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని ముక్తాపూర్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో రూ.10 కోట్ల విలువైన సీఎంఆర్ యాక్షన్ ధాన్యం మాయమైంది. పౌర సరఫరాల శాఖ అధికారుల తనిఖీలో రూ.10 కోట్ల విలువైన ధాన్యాన్ని సదరు రైస్‌మిల్లు యజమాని గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకొని మిల్లును మూసేసి వెళ్లిపోయినట్టు తేలింది. వివరాల్లోకి వెళితే.. 2022–23 సంవత్సరం రబీ సీజన్‌కు గాను యాదాద్రి జిల్లాలోని రైస్‌మిల్లర్లకు పౌర సరఫరాల శాఖ అధికారులు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కొరకు ధాన్యం ఇచ్చారు. అయితే ఎఫ్‌సీఐ ధాన్యం తీసుకోవడం లేదని అప్పటి ప్రభుత్వం సీఎంఆర్ రైస్ బదులు డబ్బులు చెల్లించేందుకు యాక్షన్ పిలిచింది. ఈ నేపథ్యంలో 2022–23 రబీ సీజన్‌కు గాను సివిల్ సప్లయ్ శాఖ ముక్తాపూర్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 11 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యాన్ని ఇవ్వగా మిల్లు యజమాని గతేడాది జనవరిలో 4,400 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ సంబంధించి డబ్బులు చెల్లించాడు. మిగతా 6,600 మెట్రిక్‌టన్నుల సీఎంఆర్ డబ్బులు ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు చెల్లించాల్సి ఉంది. అధికారులు ఎన్నిసార్లు అడిగినా స్పందనలేక పోవడంతో ఈ నెల 3న విజిలెన్స్ అధికారులు రైస్‌మిల్లు సందర్శనకు వచ్చారు. ఆ సమయంలో మిల్లు మూసేసి ఉంది. మిల్లులోని షట్టర్లు విరిగి ఉండడంతో అధికారులు లోనికి వెళ్లి చూడగా ధాన్యం పురుగుపట్టి పాడైపోయింది. బస్తాల స్టాక్‌ను లెక్కించి 1,600 మెట్రిక్ టన్నుల ధాన్యంఉందని తేల్చారు. ఇందులో రూ.10 కోట్ల విలువైన 5వేల టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు.

రెవెన్యూ యాక్ట్ ప్రకారం కేసు

రైస్‌మిల్లు యజమానికి ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందనలేక పోవడంతో పౌర సరఫరాల శాఖ అధికారులు ఈ నెల 5న స్థానిక తహసీల్దార్ మహేందర్‌రెడ్డి సమక్షంలో రైస్‌మిల్లును సీజ్ చేశారు. అలాగే మిల్లర్‌పై రెవెన్యూ రికార్డు యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. గతేడాది జిల్లాలో భువనగిరి మండలం అనంతారంలో ఓ రైస్‌మిల్లు యజమాని సీఎంఆర్ వడ్లు అమ్ముకొని రూ.5 కోట్లు చెల్లించక పోవడంతో అధికారులు మిల్లును సీజ్ చేశారు. తాజాగా ఇది రెండో కేసు కావడం విశేషం. అయితే మిల్లు యజమాని శీల శ్రీనివాస్‌ది కరీంనగర్ జిల్లా జగిత్యాల కాగా ముక్తాపూర్‌కు వచ్చి ఇక్కడ 5 ఎకరాల లీజు భూమిలో 2017లో లక్ష్మీనర్సింహస్వామి ఆగ్రో ఇండస్ట్రీస్ పేరిట రైస్‌మిల్లును ఏర్పాటు చేసినట్టు అధికారుల విచారణలో తేలింది.

కేసు నమోదు చేశాం



ముక్తాపూర్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని 6,600 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ డబ్బులు ఇవ్వాల్సి ఉంది. మిల్లును సందర్శించగా కేవలం 1,600 మెట్రిక్‌టన్నుల ధాన్యం మాత్రమే స్టాక్ ఉంది. మిగతా ధాన్యం అమ్ముకొన్నట్లు తేలింది. దాంతో మిల్లును సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేశాం.

– జగదీశ్‌కుమార్, పౌర సరఫరాల డీఎం, యాదాద్రి భువనగిరి

'ఇందిరమ్మ' అర్జీల పరిశీలన

- దరఖాస్తుదారుల ఇంటింటి సర్వే ప్రారంభం
- ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 1.20 లక్షల దరఖాస్తులు
- ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది



వివరాలను నమోదు చేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి, పక్కన భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి

భువనగిరి టౌన్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంట్లో భాగంగా సోమవారం దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు సర్వే ప్రారంభించింది. అర్హులైన వారినే నూటికి నూరుశాతం లబ్ధిదారుల ఎంపికకు రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా వ్యవహించేలా ఇప్పటికే గ్రామాల్లో వార్డుల వారీగా కమిటీలు వేశారు.

అర్హుల గుర్తింపునకు మొబైల్ యాప్

జిల్లా వ్యాప్తంగా గతేడాది డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి జిల్లా నుంచి 1.20 లక్షల మంది వరకు దరఖాస్తులు అందించారు. వీరిలో అర్హులైనవారి గుర్తించేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వచ్చిన అర్జీల సర్వేపై గూగుల్ మీట్ ద్వారా అధికారులతో మాట్లాడి క్షేత్ర స్థాయిలో తిరిగి అర్హులను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాలో 17 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో అర్హుల గుర్తింపునకు సోమవారం సర్వే ప్రారంభించారు. ఇందుకోసం మొబైల్ యాప్‌ను వినియోగిస్తూ దరఖాస్తుదారుల నివాసాలకు వెళ్లి వారి పూర్తి వివరాల పరిశీలిస్తూ మొబైల్ యాప్‌లో పొందుపరుస్తున్నారు.

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనకు జిల్లా వ్యాప్తంగా సోమవారం సర్వే ప్రారంభమైంది. దీంట్లో భాగంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో సర్వేను అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. స్వయంగా మొబైల్ యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేశారు. వారివెంట భువనగిరి మున్సిపల్ కమిషనర్ పి.రామాలజురెడ్డి తదితరులు ఉన్నారు.

సర్వేకు సహకరించాలి

ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం పెట్టుకున్న దరఖాస్తులు పరిశీలించి వివరాలు మొబైల్ యాప్‌లో పొందుపరచడానికి సర్వే నిర్వహిస్తున్నాం. జియోట్యాగింగ్ ద్వారా ఫొటో తీసుకుంటున్నాం. దరఖాస్తుదారులంతా కచ్చితమైన సమాచారమిస్తూ సర్వేకు సహకరించాలి.

– హనుమంతరావు, జిల్లా కలెక్టర్

దాతలు చేయూతనివ్వాలి



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న డీఈఓ

భువనగిరి: ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకు రావాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. చలికాలం నేపథ్యంలో హాస్టళ్లలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలతో సోమవారం భువనగిరిలో పలు సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ దుప్పట్ల పంపిణీకి దాత గోపాల్‌అగర్వాల్ సహకారం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ కోఆర్డినేటర్లు శ్రీనివాస్, నరహరి, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ రూరల్: ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీకాం, బీఎస్సీ కంప్యూటర్, బీటెక్ మెకానిక్, డిప్లొమా మెకానికల్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ ఇస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ లోగా ఆసక్తి గల అభ్యర్థులు నల్లగొండ రీజనల్ మేనేజర్ కార్యాలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల్లో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. 3 సంవత్సరాల పాటు అప్రెంటిస్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎంజీయూ బాస్కెట్‌బాల్ మహిళా జట్టు ఎంపిక



ఎంపికైన బాస్కెట్‌బాల్ మహిళా జట్టు

నల్లగొండ రూరల్: కేరళ రాష్ట్రంలోని కొట్టాయంలో ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరుగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల బాస్కెట్‌బాల్ పోటీలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ మహిళా జట్టును సోమవారం ఎంపిక చేసినట్లు ఎంజీయూ స్పోర్ట్స్ కార్యదర్శి హరీష్ తెలిపారు. ఎంపికైన జట్టును కోఆర్డినేటర్ శ్యాంసుందర్, మురళి, శ్రీనివాస రెడ్డి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఎయిర్ పిస్టల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



సిల్వర్ మెడల్‌తో పవన్

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని పెద్ద రావులపల్లి గ్రామానికి చెందిన తప్పెట పవన్ రాష్ట్రస్థాయి ఎయిర్ పిస్టల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. సోమవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి తెలంగాణ స్పోర్ట్ అథారిటీలో 68వ తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎయిర్ పిస్టల్ పోటీలలో అండర్ –19 విభాగంలో పవన్ 10 మీటర్ల టార్గెట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. అంతేకాక పవన్ జాతీయ స్థాయికి కూడా ఎంపికయ్యాడు.

డివైడర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో సోమవారం ఓ ప్రైవేట్ బస్సు డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు పెద్దకాపర్తి గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గల కాటన్ మిల్లు సమీపంలోకి రాగానే టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40మందికి పైగా ప్రయాణికులున్నారు. బస్సు డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

కల్వర్టును ఢీకొని కారు బోల్తా

మఠంపల్లి: మండల కేంద్రం సమీపంలోని కప్పలవాగు కల్వర్టును ఢీకొని కారు బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం జరిగింది. మేళ్లచెరువు మండలం మాధవరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో హుజూర్‌నగర్ మండలం అంజలీపురం వెళ్లి వస్తుండగా మఠంపల్లి మండల కేంద్రం సమీపంలో కప్పలవాగుపై నిర్మించిన కల్వర్టుకు ఢీకొట్టడంతో కారు కాలువలో పడిపోయింది. వాగులో నీరు తక్కువగా ప్రవహిస్తుండడంతో కారులోని వ్యక్తులు క్షేమంగా బయటపడ్డారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ సలీం పాష



క్రేన్ సహాయంతో బస్సును రోడ్డు పక్కకు తీయిస్తున్న పోలీసులు

- అక్కడికక్కడే బస్సు డ్రైవర్ మృతి
- 15 మంది ప్రయాణికులకు గాయాలు
- విరామం లేకుండా డ్యూటీ వేశారని మృతుడి కుటుంబ సభ్యుల ఆగ్రహం
- కేసు నమోదు చేసిన చౌటుప్పల్ పోలీసులు

చౌటుప్పల్ రూరల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని ఆంథోళ్ మైసమ్మ గుడి సమీపంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ డిపోకు చెందిన డీలక్స్ బస్సు నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. దండుమల్కాపురం గ్రామ స్టేజీ దాటిన తర్వాత ఆంథోళ్ మైసమ్మ గుడి సమీపంలో జాతీయ రహదారిపై డీజిల్ అయిపోయి ఎయిర్‌లాక్ కావడంతో లారీ ఆగిపోయింది. ఈ లారీ డీలక్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ సయ్యద్ సలీం పాష(50) బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 35మంది ప్రయాణికులు ఉన్నారు. బంటు శేఖర్, మిడతపల్లి సైదులుతో పాటు మరో పది మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్వల్పంగా గాయపడిన ప్రయాణికులు వేరే వాహనాల్లో వెళ్లిపోయారు. బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ సలీం పాష మృతదేహాన్ని పోలీసులు క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం కాగా.. పోలీసులు క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన బస్సు డ్రైవర్ సలీం పాష స్వగ్రామం చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామం కాగా 25 ఏళ్ల క్రితం నల్లగొండకు వెళ్లిపోయారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్ల యాదవరెడ్డి తెలిపారు.



సలీం పాష (ఫైల్)

విరామం లేకుండా డ్యూటీలు వేయడం వల్లే..

ఆర్టీసీ అధికారులు విరామం లేకుండా డ్యూటీలు వేయడం వల్లనే బస్సు ప్రమాదాలు జరుగుతున్నాయని మృతుడు సలీం పాష కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆదివారం డ్యూటీకి వెళ్లిన సలీం పాషా సోమవారం మధ్యాహ్నం 1 గంటలకు డ్యూటీ అయిపోవడంతో ఇంటికి వస్తున్నానని చెప్పాడని, కొద్దిసేపటికే మళ్లీ డ్యూటీ వేశారని హైదరాబాద్ వెళ్లి వస్తానని ఫోన్‌లో చెప్పి ఇలా ప్రమాదంలో మృతిచెందాడని సలీం పాష సోదరుడు అనీస్ పాష బోరున విలపించాడు. ఈ ప్రమాదానికి ఆర్టీసీ వారే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ డ్రైవర్‌ను కోల్పోయాం

– ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి

నల్లగొండ క్రైం: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులో సోమవారం జరిగిన ప్రమాదంలో నల్లగొండ డిపోకు చెందిన డ్రైవర్ సయ్యద్ సలీంపాష మృతిచెందాడని, సంస్థ ఒక ఉత్తమ డ్రైవర్‌ను కోల్పోయిందని ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ డిపోకు చెందిన డీలక్స్ బస్సు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ సలీంపాష ఇటీవల ఉత్తమ డ్రైవర్‌గా (కేఎంపీఎల్) అవార్డు పొందాడని, టిమ్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని ఆర్‌ఎం తెలిపారు. లారీ డ్రైవర్ తప్పిదం వల్లే ప్రమాదం జరిగిందని చెప్పారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకుండా లారీని రోడ్డుపై నిలిపాడని తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో రోడ్డు ఏటవాలుగా ఉండటంతో.. లారీ నిలిచినప్పటికీ వెళుతున్నట్లుగా బస్సు డ్రైవర్ భావించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్‌పై ఫిర్యాదు చేసినట్లు ఆర్‌ఎం తెలిపారు. బస్సు డ్రైవర్ విశ్రాంతి లేకుండా విధులు నిర్వహిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై 15 రోజులు సెలవు తీసుకున్నట్లు తెలిపారు.

బైక్ ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

చౌటుప్పల్ రూరల్: ఈ బస్సు ప్రమాదం చూసేందుకు జాతీయ రహదారి పక్కన నిల్చున్న ఆటో డ్రైవర్‌ను బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ ఆటో డ్రైవర్ సయ్యద్ రహీం(28) ఆటోను ముందుకు నిలిపి బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశానికి వచ్చి రోడ్డు పక్కన నిలబడి చూస్తుండగా.. సంస్థాన్ నారాయణపురం మండలం కోర్లగడ్డతండాకు చెందిన అంగోతు అభినాయక్ బైక్‌పై అతివేగంగా వచ్చి సయ్యద్ రహీంను ఢీకొట్టాడు. దీంతో సయ్యద్ రహీం కాలు విరిగింది. క్షతగాత్రుడు చికిత్స నిమిత్తం మరో వాహనంలో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. ప్రమాదానికి కారణమైన అభినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చల్ల యాదవరెడ్డి తెలిపారు.

‘నైటా’ అధ్యక్షురాలిగా ఏనుగు వాణి



నూతనంగా ఎన్నికైన న్యూయార్క్ తెలంగాణ తెలుగు అసోసియేషన్ కార్యవర్గం

- ఆమె స్వస్థలం ఆత్మకూరు (ఎం) మండలం సిద్దాపురం



ఏనుగు వాణి



ఏనుగు లక్ష్మణ్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): అమెరికాలోని న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) కొత్త అధ్యక్షురాలిగా ఏనుగు వాణి ఎన్నికయ్యారు. ఏనుగు వాణి స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని సిద్దాపురం. న్యూయార్క్ నగరంలోని రాడిసన్ హోటల్‌లో భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నైటా కార్యవర్గాన్ని ఏడాదికొకసారి ఎన్నుకుంటారు. నైటాలో మొత్తం వెయ్యి మంది సభ్యులు ఉన్నారు. నైటా ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షురాలిగా ఏనుగు వాణితో పాటు మరో 8 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ వింగ్ నుంచి చైర్మన్‌తో సహా 12 మందితో కార్యవర్గం ఎన్నికైంది. నలుగురిని సలహాదారులుగా ఎన్నుకున్నారు. ఏనుగు వాణి భర్త ఏనుగు లక్ష్మణ్‌రెడ్డి ‘నైటా’ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ వింగ్ నుంచి వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఏనుగు వాణి పుట్టినిల్లు యాదాద్రి జిల్లాలోని వలిగొండ మండలం సుంకిశాల గ్రామం కాగా.. ఇదే జిల్లాలోని ఆత్మకూరు(ఎం) మండలం సిద్దాపురం మెట్టినిల్లు. 25 సంవత్సరాల క్రితం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ‘నైటా’ ఆధ్వర్యంలో న్యూయార్క్ నగరంలో తెలంగాణ సంప్రదాయాలను చాటిచెప్పే పండుగలను ఘనంగా నిర్వహిస్తుంటారు. అంతే కాకుండా కరోనా సమయంలో, వరదలు వచ్చినప్పుడు న్యూయార్క్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో సేవా కార్యక్రమాలను చేపట్టారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

మోతె: గంజాయి తరలిస్తున్న వ్యక్తులను మోతె మండలం మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన బత్తుల హరీష్, బత్తుల విరాట్ ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుభాష్‌కు గంజాయి కావాలని ఫోన్ చేశారు. ఈ మేరకు ఆదివారం సుభాష్ గంజాయి తీసుకుని ఖమ్మం వచ్చాడు. బత్తుల విరాట్, బత్తుల హరీష్‌తో పాటు ఎస్‌కే హుస్సేన్‌బాషా ఖమ్మంలో సుభాష్‌ను కలిసి అతడి వద్ద గంజాయి తీసుకుని స్కూటీ డిక్కీలో పెట్టుకొని నలుగురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై ఖమ్మం నుంచి సూర్యాపేట వైపు వస్తున్నారు. మార్గమధ్యలో మోతె మండలం మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్దకు వచ్చి మోతె మండల కేంద్రానికి చెందిన వెలుగు జయసింహ, దోసపాటి కళ్యాణ్‌రామ్, పగడాల ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెలుగు ఆనంద్, కొండా ఉదయ్‌ను కలిశారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు టోల్ ప్లాజా వద్ద ఉన్న మైదానంలో వీరిని పట్టుకొని 1.640 గ్రాముల గంజాయి, రెండు స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని కోర్టుకు రిమాండ్ చేశారు. నిందితులను పట్టుకున్న వారిలో ఆర్‌ఐ మన్సూర్ అలీ, మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు వీరస్వామి, రామనర్సయ్య, సుమన్, షరీఫ్ ఉన్నారు. వారిని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అభినందించారు.



గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రోడ్డుపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్





చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో హైవేపై గుంతలను పూడుస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకన్న

చౌటుప్పల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ పట్టణంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా సోమవారం తంగడపల్లి చౌరస్తా వద్ద డ్యూటీ నిర్వహించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ గుగులోతు వెంకన్న కాంక్రీట్ తెప్పించి గుంతలను అతడే స్వయంగా పూడ్చివేశాడు. అనంతరం ఆ ప్రాంతంలో సూచికను ఏర్పాటు చేశాడు. ఇదంతా గమనించిన స్థానికులు, వాహనదారులు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను వెంకన్నను అభినందించారు.

పట్టపగలు తాళం వేసిన ఇంట్లో చోరీ

- మూడు తులాల బంగారం, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

డిండి: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన డిండి మండల కేంద్రంలో సోమవారం జరిగింది. డిండి మండల కేంద్రంలోని ప్రెస్ కాలనీకి చెందిన శ్రీరామదాసు మధుసూదనాచారి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు మధుసూదనాచారి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఇంటికి తిరిగొచ్చిన మధుసూదనాచారి తాళం పగులగొట్టి ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ రాజు వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు తులాల బంగారం, పది పట్టుచీరలు

కోదాడరూరల్: కోదాడ పట్టణ పరిధిలోని శ్రీనివాస నగర్‌లోని దశరథ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దశరథ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న జనార్దన్‌రెడ్డి మూడు రోజుల కిందట తన కుమార్తె వివాహం చేశాడు. ఆదివారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని తన అల్లుడి ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. సోమవారం ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉండడంతో జనార్దన్‌రెడ్డికి సమాచారం ఇచ్చింది. ఆయన కోదాడకు చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రెండు తులాల బంగారం, రూ.5వేల నగదు, 10 పట్టుచీరలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులు క్లూస్‌టీంను పిలిపించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

ద్విచక్ర వాహనంలో నుంచి రూ.3లక్షలు..

దేవరకొండ: ద్విచక్ర వాహనంలో ఉంచిన రూ.3లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం దేవరకొండ పట్టణంలో జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండల పరిధిలోని తాటికోల్ గ్రామానికి చెందిన రైతు మారుపాకల నిరంజన్ తాను విక్రయించిన పత్తికి సంబంధించి రూ.3లక్షలు యూనియన్ బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. నగదును డ్రా చేసిన నిరంజన్ తన ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టుకొని బయల్దేరాడు. పట్టణంలోని కోర్టు సమీపంలో గల మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. మందులు కొనుగోలు చేసి తిరిగి తన వాహనం వద్దకు వచ్చి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు డిక్కీ పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమతులు లేకుండా బ్లాస్టింగ్

- నలుగురిపై కేసు నమోదు


వలిగొండ: ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిలో బ్లాస్టింగ్‌కు పాల్పడుతుండగా ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పేలుడు పదార్థాలను సీజ్ చేశారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం ఎం. తుర్కపల్లి గ్రామానికి చెందిన రైతు తన వ్యవసాయ భూమిలో ఉన్న రాళ్లను తొలగించడానికి కొందరు వ్యక్తులతో కలిసి బ్లాస్టింగ్‌కు పాల్పడుతుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. 25 జిలిటిన్ స్టిక్స్, డిటోనేటర్ పవర్ కేబుల్ బండిల్, బైండింగ్ వైర్లను సీజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

రైతుపై పోస్టుమాస్టర్ ఆగ్రహం

కొండమల్లేపల్లి: రైతుపై సబ్ పోస్టుమాస్టర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. కొండమల్లేపల్లి మండలం జోగ్యతండాకు చెందిన రమావత్ గిరి పత్తి అమ్ముకోవడంతో కొండమల్లేపల్లి పోస్టాఫీస్‌లోని తన ఖాతాలో నగదు జమయ్యాయి. అతడి పోస్టాఫీస్ ఖాతా జీరో అకౌంట్ కావడంతో అదనంగా ఫిక్స్ డిపాజిట్ అకౌంట్ ఓపెన్ చేసేందుకు సోమవారం తపాలా కార్యాలయానికి వచ్చాడు. ఈ క్రమంలో సబ్ పోస్టుమాస్టర్ రూ.1000 ఉంటేనే ఖాతా తెరుస్తామని లేదంటే కుదరదని చెప్పాడు. ఖాతా తెరిచేందుకు రూ.500 కడితే సరిపోతుంది కదా అని గిరి అడగగా.. సబ్ పోస్టుమాస్టర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీనిని గిరి తన సెల్ ఫోన్‌లో చిత్రీకరిస్తుండడంతో అతడిని సబ్ పోస్టుమాస్టర్ కొట్టబోయాడు. సబ్ పోస్టుమాస్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గిరి కోరుతున్నాడు.

70వ వసంతంలోకి సాగర్ ప్రాజెక్టు

- నేటితో 69 సంవత్సరాలు పూర్తి
- ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ
- 1967లో కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల
- రెండు తెలుగు రాష్ట్రాలకు వరప్రదాయినిగా విరాజిల్లుతున్న ఆధునిక దేవాలయం



జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన పైలాన్



శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ (ఫైల్)

నాగార్జునసాగర్: రెండు తెలుగు రాష్ట్రాలకు వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు 70వ వసంతంలోకి అడుగు పెడుతోంది. 1955 డిసెంబర్ 10న భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టు నిర్మాణానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నందికొండ సమీపంలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కుడి కాలువను జవహర్ కాలువగా పిలుస్తారు. జవహర్ కాలువ నిర్మాణ పనులను 1956 అక్టోబర్ 10న అప్పటి ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు. దక్షిణ విజయపురి వద్ద ఈ కాలువ సొరంగ మార్గం ద్వారా ప్రారంభమై 392 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఈ కాలువ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11,74,874 ఎకరాల సాగుకు స్థిరీకరించారు. 132 టీఎంసీల నీటిని కేటాయించారు. సాగర్ ప్రాజెక్టు ఎడమ వైపు నుంచి ప్రారంభమయ్యే కాలువను లాల్‌బహదూర్ కాలువగా పిలుస్తారు. ఈ కాలువ పొట్టిచెలమ నుంచి చలకుర్తి వరకు సొరంగ మార్గం ద్వారా ప్రయాణిస్తుంది. ఈ కాలువ నిర్మాణాన్ని 1959లో ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ భీమ్‌సేన్ సచార్ ప్రారంభించారు. ఈ కాలువ పొడవు 349 కిలోమీటర్లు. ఈ కాలువ కింద 10,37, 796 ఎకరాలు సాగవుతుందని స్థిరీకరించారు. 132 టీఎంసీల నీటిని కేటాయించారు. రిజర్వాయర్ నీటిమట్టం 489 అడుగుల పైన ఉన్నప్పుడు కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేయవచ్చు. 1967 ఆగస్టు 4న నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాలువలకు మొట్టమొదటిసారి నీటిని వదిలారు.

నెరవేరని లక్ష్యం..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ లక్ష్యం నేటికీ నెరవేరలేదు. ఆనాడు తవ్విన కుడి, ఎడమ కాల్వలు కాలక్రమేణా దెబ్బతిని చివరి భూములకు నీరందే పరిస్థితి లేకుండాపోయింది. అయితే ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సాగర్ ప్రాజెక్టు కింద చివరి భూములకు కూడా నీరందించాలని సంకల్పించి ప్రపంచ బ్యాంకు రుణంతో సాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఆ పనులు 2017లో పూర్తయ్యాయి. కానీ పనుల్లో నాణ్యత లేని కారణంగా గతేడాది రెండుసార్లు కాల్వకు గండ్లు పడ్డాయి. నేటికీ చివరి భూములకు నీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూడిక నిండటంతో రెండు పంటలకు చాలని నీరు..

నాగార్జునసాగర్ జలాశయంలో పూడిక చేరడంతో ఒకసారి నిండితే రెండు పంటలకు నీరు సరిపోవడం లేదు. దీనికి తోడు జలాశయంలోని నీటి విడుదల ప్రణాళికను తయారు చేసేందుకు సాగునీటి శాఖ అధికారులు రాజకీయ నాయకుల ఆదేశాల కోసం ఎదురుచూడడంతో నీటి విడుదల ఆలస్యమై ప్రాజెక్టులోకి వచ్చిన వృథాగాపోతోంది. ఇప్పటికీ ఏ తూము ద్వారా ఎంత నీటిని విడుదల చేస్తే ఎన్ని ఎకరాలు పారుతుందనేది అధికారుల వద్ద నిక్కచ్చి సమాచారం లేదు. మెయిన్ కాల్వకు ఉన్న మేజర్ల దగ్గరి నుంచి ప్రతి పంట కాల్వకు షట్టర్లు బిగించాలి. నారుమళ్ల సమయంలో తక్కువ నీరు, పొలం తడిపే సమయంలో, పొట్ట దశలో నీటిని సరిపోను వాడుకునేలా డిజైన్ చేసి తూములు ఏర్పాటు చేయాలి. ఆ తూములకు షట్టర్లు బిగించాలని రైతులు కోరుతున్నారు. మేజర్ల దగ్గరి నుంచి పంటకాల్వల వరకు ఏ తూముకు ఏ నెల ఎంత నీటిని విడుదల చేయాలి, ఎంత భూమి పారుతుందనే బోర్డులు పెట్టి వాటిపై నమోదు చేయాలి. కాలువల స్థానంలో పైపులైన్లు అమర్చితే మరికొన్ని భూములకు సాగునీరందే అవకాశాలుంటాయి.

ఈ ఏడాది రెండు పంటలకు నీరందిస్తాం



ఈ ఏడాది వచ్చిన వరదలకు సాగర్ జలాశయంలో సమృద్ధిగా నీరుంది. రెండు కార్లకు నీరు సరిపోతుంది. రైతులు నీటిని పొదుపుగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటాం. నీరు జలాశయంలో మిగిలి ఉంటే వచ్చే ఏడాది ముందస్తుగా పంట పొలాలకు నీటిని విడుదల చేసే వీలుంటుంది. – మల్లికార్జున్, సాగర్ డ్యాం ఈఈ

సాగర్ జలాశయం విస్తీర్ణం	110 చదరపు మైళ్లు
గరిష్ట నీటిమట్టం	590 అడుగులు
డెడ్ స్టోరేజీ లెవల్	490 అడుగులు
నీటి నిల్వ సామర్థ్యం	408.24 టీఎంసీలు
(ప్రస్తుతం పూడిక నిండటంతో	312 టీఎంసీలు)
డెడ్ స్టోరేజీ సామర్థ్యం	179.16 టీఎంసీలు
(ప్రస్తుతం పూడిక నిండటంతో	168 టీఎంసీలు)
నీటి విడుదలకు ఉండాల్సిన కనీస నీటిమట్టం	510 అడుగులు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

మద్దిరాల: ఆటోను కారు ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మద్దిరాల మండల కేంద్రంలో సోమవారం జరిగింది. సూర్యాపేట నుంచి లింగయ్య అనే వ్యక్తి వరంగల్‌కు ఆటోలో వెళ్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌లోని కురవి వైపు వెళ్తున్న కారు మద్దిరాల మండల కేంద్రంలోని 365వ నంబర్ హైవేపై ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగయ్యకు గాయాలయ్యాయి. పోలీసులు లింగయ్యను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వీరన్న తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



బుర్రి కృష్ణారెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన బుర్రి కృష్ణారెడ్డి (74) పారామెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉంటున్న తన పెద్దకుమారుడి వద్దకు వెళ్లి ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యలో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ సమీపంలో రహదారిపై కిందపడటంతో కృష్ణారెడ్డి తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి తలకు శస్త్రచికిత్స చేశారు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కృష్ణారెడ్డి మృతిచెందాడు. మృతుడి భార్య చంద్రకళ పదిహేనేళ్ల క్రితం మృతి చెందింది. ముగ్గురు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



శివయ్య (ఫైల్)

వలిగొండ: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన వలిగొండ మండలం ఎదుళ్లగూడెం గ్రామ స్టేజీ సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం మాదారం గ్రామానికి చెందిన సందెల శివయ్య(42) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శివయ్య ఆదివారం ఆటోలో వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయల్దేరాడు. రాత్రి వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం వలిగొండ మండలం ఎదుళ్లగూడెం గ్రామ స్టేజీ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. అటుగా వెళుతున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.